సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 18 । జూలై । 2023



పాత పద్ధతిలోనే నిర్వహణ

భీమడోలు: కామవరపుకోటలోని చినవెంకన్న దేవస్థానం కళాశాలలను ప్రభుత్వానికి అప్పగించాలని గతంలో చేసిన తీర్మానాన్ని ధర్మకర్తల మండలి రద్దు చేసింది. 8లో



కాలువలోకి దూసుకెళ్లిన కారు

విజయవాడ-అవనిగడ్డ కరకట్టపై వెళ్తున్న కారు కేఈజీ కెనాల్‌లోకి సోమవారం వేకువజామున దూసుకెళ్లింది. దీంతో కారులో వ్యక్తి గల్లంతయ్యాడు. 8లో



పుట్టగొడుగులతో లాభాలు

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకమని, వీటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రోత్సహించాలని సహాయ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ భరత్‌లక్ష్మి అన్నారు. 8లో

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులపై తక్షణ విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఏఎస్పీ ఏవీ సుబ్బరాజుతో కలిసి బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 17 మంది ఫిర్యాదులు అందించారు.

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ

భీమవరంలో ఈనెల 19 నుంచి హెల్మెట్ ధరించడం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎస్పీ రవిప్రకాష్ తెలిపారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణం చేసేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ప్రయోగాత్మకంగా భీమవరం పట్టణానికి వచ్చే ప్రధాన ఆరు రహదారుల్లో 24 గంటలూ హెల్మెట్ డ్రైవ్ ఉంటుందన్నారు. హెల్మెట్ లేకుంటే పట్టణంలోకి అనుమతి ఉండదని, ద్విచక్రవాహనదారులు సహకరించాలని కోరారు.

ప్యాకేజీ మాటలు సహించం



మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కులాన్ని అడ్డం పెట్టుకుని ప్యాకేజీ మాటలు మాట్లాడితే సహించమని శెట్టిబలిజ సంఘ నాయకుడు గుబ్బల వేణు హెచ్చరించారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డు గెస్ట్‌హౌస్‌లో శెట్టిబలిజ సంఘ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సీఎం జగన్ శెట్టిబలిజలకు ప్రాధాన్యమిస్తూ కవురు శ్రీనివాస్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారన్నారు. అలాగే కవురుకు ఇప్పటికే డీసీసీబీ చైర్మన్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ పదవులు అప్పగించి జిల్లాలో శెట్టిబలిజ కులానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారన్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో శెట్టిబలిజ సంఘ జిల్లా అధ్యక్షుడిని అని చెబుతున్న కుక్కల శ్రీనివాస్ అనే వ్యక్తి కవురు శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, అలాగే శెట్టిబలిజ ఒక్కటే కులమని మిగిలిన ఉప కులాలతో తమకు సంబంధం లేదని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గౌడ, శెట్టిబలిజ, యాత, ఈడిగ, శ్రీశైన అన్నీ ఒక్కటేనని మేమంతా కలిసిమెలిసి ఉన్నామన్నారు. ప్యాకేజీ తీసుకుని కులాల మధ్య చిచ్చుపెట్టి విభజించి లబ్ధి పొందాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవురు కృషితో అతి త్వరలో సంఘ భవనానికి రూ.2.10 కోట్లు నిధులు రానున్నట్టు చెప్పారు. నాయకులు పితాని సత్యనారాయణ (చిన్ని), బొక్కా గంగాధరరావు, గుబ్బల సత్యనారాయణ, కుక్కల బాలచందర్, చింతపల్లి సాయిబాబా, కాండ్రేకుల రాజేశ్వరి, కడలి రామలక్ష్మి, కడలి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ కేంద్రాల నమోదు తప్పనిసరి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలు (అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) కేంద్రాలు, సరోగసి కేంద్రాలు) తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తెలిపారు. ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో నిర్దేశించిన మొత్తం డీడీతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిని జిల్లాస్థాయి బృందం పరిశీలించిన అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీకి కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీకి సిఫార్సు చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఐదేళ్లకు కలిపి ఒకేసారి రెన్యూవల్ చేసుకోవాలని, అనుమతులు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఆర్పీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు(మెట్రో): ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) పరిధిలో ఏలూరు జిల్లా రిసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ)గా ఇన్సెంటివ్ పద్ధతిలో పనిచేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ ఎస్.రామ్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిగ్రీ పూర్తిచేసిన వారికి ప్రాధాన్యమిస్తారని, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఎంబీఏ పూర్తిచేసిన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. అలాగే బ్యాంకింగ్, బీమా, ఎల్‌ఐసీ, మార్కెటింగ్, స్వచ్ఛంద సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉన్నవారికి కూడా ప్రాధాన్యమిస్తారని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఆహార పరిశ్రమల ఏర్పాటుకు డీఆర్పీ కృషిచేయాలన్నారు. ఈనెల 25లోపు దరఖాస్తులు పంపాలని, వివరాలకు సెల్ 99859 03417లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ బడులు కిటకిట

సర్కారీ బడులకు 'వంద'నం

- 80 శాతం పాఠశాలల్లో నూరు శాతం విద్యార్థులు
- పూర్తిస్థాయిలో డ్రాప్ అవుట్స్ చేరికకు చర్యలు
- 'పది' అనుత్తీర్ణులైన విద్యార్థులు మళ్లీ బడిలో చేరే అవకాశం
- కొనసాగుతున్న ప్రవేశాలు



ఆకివీడులో పులవర్తి లక్ష్మణస్వామి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఆకివీడు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా విద్యార్థుల చేరిక కొనసాగుతూనే ఉంది. ఆగస్టు వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమివ్వడంతో పాటు పాఠశాలలను నాడు-నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేయడం, కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించడం, ఇంగ్లిష్ మీడియం చదువులు, డిజిటల్ విద్య తదితర కారణాలతో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది. పలువురు విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల నుంచి వచ్చి ప్రభుత్వం బడుల్లో చేరేందుకు క్యూ కడుతున్నారు.

సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు

జిల్లాలో ఇప్పటికే 80 శాతం పాఠశాలల్లో నూరు శాతం ప్రవేశాలు పూర్తయ్యాయి. అయినా విద్యార్థులు వస్తుండటంతో అడ్మిషన్లు ఇస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	
ఎంపీపీ పాఠశాలలు	965
జెడ్పీ పాఠశాలలు	73
ప్రైమరీ, యూపీ, సెకండరీ పాఠశాలలు	170
మున్సిపల్ పాఠశాలలు	140
మొత్తం	1,348

ప్రస్తుతం జిల్లాలోని 1,348 పాఠశాలల్లో సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం విద్యాప్రమాణాలు మెరుగు పరిచేందుకు సీబీఎస్‌సీ సిలబస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. డిజిటల్ తరగతులు, ఇంగ్లిష్ మీడియం, బైజూస్ ట్యాబ్‌లతో విద్యా బోధనలో నూతన ఒరవడులు సృష్టించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. విద్యా బోధనలోనే కాకుండా వసతుల కల్పనలో ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల రూపురేఖలు మార్చివేసింది. అధునాతన వసతులతో కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా బడులను తీర్చిదిద్దుతోంది. అలాగే జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. దీంతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా మారేలా చర్యలు తీసుకుంది.

బడిఈడు పిల్లలు బయట తిరగకుండా..

జిల్లాలో వివిధ కారణాల వల్ల బడి ఈడు పిల్లలు బడి బయట తిరగకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో బడి బయట పిల్లలు సుమారు 4 వేల మంది ఉన్నట్టు గుర్తించి వారిని ఈనెల 25లోపు బడుల్లో చేర్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో నూరు శాతం పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ప్రైవేట్ స్కూళ్ల నుంచి..

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య బాగానే ఉంది. అయితే పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు పిల్లలకు టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయి. దీంతో సర్కారు బడుల్లో చేరిన వారి ప్రవేశాలు స్తంభంగా ఉండిపోయాయి. అటువంటి విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తక్షణమే టీసీలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

టెన్త్ ఫెయిలైన వారికి..

పదో తరగతి అనుత్తీర్ణులైన విద్యార్థులు మళ్లీ బడికి వెళ్లి చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఈ ఏడాది నుంచి కల్పించింది. దీంతో టెన్త్ ఫెయిలైన విద్యార్థులు పాఠశాలల్లో చేరుతున్నారు.

మరింత మంది ప్రవేశాలు



ప్రభుత్వ బడులు విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. అయినా కొత్త విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ ప్రవేశాలు తీసుకుంటున్నాం. జిల్లాలో బడికి వెళ్లని పిల్లలు సుమారు 4 వేల మందిని గుర్తించాం. వారందరినీ బడికి పంపించే చర్యలు వేగవంతం చేశాం. అన్ని పాఠశాలల్లో వసతులు సంతృప్తికరంగా ఉన్నాయి.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

నూరు శాతం విద్యార్థులు



మా హైస్కూల్‌లో నూరు శాతం విద్యార్థులు ఉన్నారు. మరింత మంది విద్యార్థుల్ని కూడా చేర్చుకుంటాం. విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాం. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు సంతృప్తిగా తింటున్నారు. మన బడి నాడు-నేడు కార్యక్రమంలో అదనపు తరగతి గదుల నిర్మాణం కొనసాగుతోంది.

– ఆర్.ఇందిర, హెచ్‌ఎం, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ఆకివీడు

ట్యాబ్‌లు ఇస్తారంట..



మా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. అలాగే గతంలో కంటే వసతులు కూడా పెరిగాయి. ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారు. డిజిటల్ తరగతులు, ఆంగ్ల విద్యా బోధన బాగుంది. ఈ ఏడాది మాకు ట్యాబ్‌లు ఇస్తారని చెప్పారు. ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన బాగుందని సీనియర్లు అంటున్నారు.

–యశ్వంత్, 8వ తరగతి విద్యార్థి, జెడ్పీ స్కూల్, ఆకివీడు

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం కలెక్టరేట్‌లో స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకి దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను గడువులోపు పరిష్కరించేలా జిల్లా, మండలస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్పందనలో 269 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీశాఖ అధికారి జీవీకే మల్లికార్జునరావు, జీఎస్‌డబ్ల్యూఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తన భర్త తాళం హనుమంతరావుకు 1993లో ప్రభుత్వం ఇళ్ల పట్టా ఇచ్చిందని, ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. న్యాయం చేయాలని అర్జీ అందించారు.
- తనకు టిడ్కో ఇళ్లలో మొదటి అంతస్తు కేటాయించారని, దివ్యాంగుడిని కావడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ ఇవ్వాలని భీమవరం 15వ వార్డుకు చెందిన మద్దాల శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించారు.
- తన భూమి దేవస్థానం భూమితో లింకు కావడంతో రుణాలు రావడం లేదని, క్రయవిక్రయాలకు ఆటంకంగా మారిందని పరిష్కారం చూపాలని ఇరగవరం మండలం కొత్తపాడుకి చెందిన సబ్బెళ్ల రామిరెడ్డి కోరారు.
- తన కుమార్తె దివ్యాంగురాలు కాగా పెన్షన్, అమ్మ ఒడి మంజూరు చేయాలని నరసాపురం మండలం తూర్పుతాళ్లుకి చెందిన కోడి నాగేశ్వరరావు అర్జీ అందజేశారు.

ఇల్లు నిర్మాణానికి సహకరించాలని..

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడు 74 ఎకరాల జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి సహకరించాలని లబ్ధిదారుడు సాకా ప్రసన్న గోపీ స్పందనలో కలెక్టర్‌ను కోరారు. తమ ప్లాట్‌కు చేర్చి రోడ్డు, పంట కాల్వ గట్టు లేఅవుట్‌లో ఉన్నాయని చెరువుదారులు రోడ్డు, కాల్వ గట్టును కూడా తవ్వివేసి అవతలి గట్టుపై మట్టి పోసుకున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

శివారు భూములకూ నీరందించాలి

జేసీ రామసుందర్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం : కాలువ శివారు భూముల్లోని వరి నారుమడులకు సైతం పూర్తిస్థాయిలో సాగునీరందించాలని, ఈ విషయంలో జలవనరులశాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ సాగుపై అధికారులతో సమీక్షించారు. కాలువల్లో గుర్రపుడెక్క, తూడును ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పంట, మురుగు కాలువల్లో డీసిల్టింగ్ పనులకు ఆమోదం వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపడతామన్నారు. ఇప్పటికే జిల్లాలో 25 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని, వచ్చేనెల 15 నాటికి నూరు శాతం నాట్లు పూర్తయ్యేలా రైతులను సమాయత్తం చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ ఈఈ ఎం.దక్షిణామూర్తి, ఇన్‌చార్జ్ జిల్లా జలవనరులశాఖ అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తి

భీమవరం(ప్రకాశంచౌక్): నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి సత్ఫలితాలు సాధించాలని జేసీ రామసుందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ నుంచి రీ సర్వే, జగనన్న సురక్ష, వాటరు ట్యాక్స్, స్పందన ఫిర్యాదులు, టూరిజం ప్రాజెక్టులు, సీసీఆర్‌సీ కార్డులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మండలాల వారీగా గ్రామాల ప్రగతి తెలుసుకుని లోటు ఉన్న మండలాల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. జగనన్న సురక్షలో సర్వీసులు మరింత పెంచాలన్నారు. రీ సర్వేను వేగిరపర్చాలన్నారు. స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటి స్థలం కోసం జిల్లా స్పందనకు అర్జీలు వస్తున్నాయని ఇటువంటివి మండల స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. సాంకేతిక సమస్యలను సాకుగా చూపి కాలయాపన చేయవద్దన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలకు కళ్లెం



ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించి నిత్యావసర సరుకులు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు నిరంతరం కళ్లెం వేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్ద ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిత్యావసర వస్తువుల విక్రయ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరల పెరుగుదలకు బాధ్యత కేంద్రానిదే అన్నారు. సబ్సిడీపై బియ్యం, కందిపప్పు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ధరలు పెరిగిపోయాయని దుష్ప్రచారం చేస్తున్నాయని, వారి మాటలు నమ్మొద్దన్నారు. ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. పోషక విలువలు కలిగిన బియ్యాన్ని పేదలకు తక్కువ ధరకు విక్రయిస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.42 ఉన్న సాధారణ రకం బియ్యం కిలో రూ.34, రూ.45 ఉన్న ఫైన్ రకం బియ్యం రూ.40, రూ.55 ఉన్న సూపర్‌ఫైన్ రకం బియ్యాన్ని రూ.46కు విక్రయిస్తున్నారన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొట్టు కోరారు. కార్పొరేట్ శక్తులు ప్రవేశించి రైతులు పండించిన పంటను గుత్తగా కొనుగోలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలు ధరలను పెంచే విధంగా కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. తహసీల్దార్ యగ్గ దుర్గాకిషోర్, ఏఎస్‌ఓ ఎం.రవిశంకర్, సివిల్ సప్లయిస్ డీటీ ఎం.చందనరావు, కర్రి భాస్కరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగిరపర్చాలి



సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న బాలునాయక్

పాలకోడేరు: సచివాలయ, ఆర్బీకే, ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్‌చీఫ్ బాలునాయక్ అన్నారు. విస్సాకోడేరులోని సచివాలయ, ప్రభుత్వ భవనాలను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నెలాఖరులోపు కట్టడాలన్నీ పూర్తి చేయాలని, బిల్లులు ప్రతినెలా రెండు సార్లు పడేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. విస్సాకోడేరులో భవనాలను సుందరంగా తీర్చిదిద్దడంపై సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌ను అభినందించారు. అధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు 'తోడు' నీడగా..

జగనన్న తోడు

- బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాల అందజేత
- నేడు 7వ విడత వడ్డీ రాయితీ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 42 వేల మందికి మేలు



జగనన్న తోడు పథకం ద్వారా అందించిన సాయంతో కూరగాయల వ్యాపారం నడుపుతున్న మహిళ

ఏలూరు (టూటౌన్): చిరు వ్యాపారులు, సాంప్రదాయ వృత్తిదారులకు జగనన్న తోడు పథకం అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2020లో పథకాన్ని ప్రవేశపెట్టి వీధి వ్యాపారులు, రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో చిన్న పాటి వ్యాపారులు చేసుకునే వారికి, సాంప్రదాయ వృత్తులు చేసుకుని జీవనం సాగించే లేసు వర్కు పనివారు, కళంకారీ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, లెదర్ వస్తువులు తయారీ, బొబ్బిలి వీణ, బ్రాస్ క్రాఫ్ట్స్ వంటి పనులు చేసేవారికి నేరుగా బ్యాంకుల ద్వారా రూ.10 వేల చొప్పున వడ్డీలేని రుణాలు అందిస్తున్నారు. వ్యాపారులు తాము తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ రాయితీ అందిస్తున్నారు. ఇలా ఇప్పటివరకూ ఆరు విడతలుగా వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు వడ్డీ రాయితీ సొమ్ములను సైతం లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం జమచేసింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం జగన్ జగనన్న తోడు పథకంలో 7వ విడతలో వడ్డీ రాయితీ సొమ్మును విడుదల చేయనున్నారు. జగనన్న తోడు పథకం ద్వారా రోజువారీ ప్రైవేట్ అప్పులు చేయాల్సిన అవస్థలు చిరు వ్యాపారులకు తప్పాయి. వ్యాపారానికి అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వమే సమకూరుస్తుండటంతో వారి వ్యాపారాలు సజావుగా సాగుతున్నాయి.

7వ విడత జగనన్న తోడు		
జిల్లా	లబ్ధిదారులు	వడ్డీ రాయితీ
ఏలూరు	19,627	రూ.42.44 లక్షలు
పశ్చిమగోదావరి	22,604	రూ.50.47 లక్షలు

ఉమ్మడి జిల్లాలో..

గతేడాది డిసెంబర్ వరకు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న వారికి సంబంధించి, ఈఎంఐలు క్రమం తప్పకుండా చెల్లించిన వారికి జగనన్న తోడు పథకంలో 7వ విడత వడ్డీ రాయితీని విడుదల చేయనున్నారు. ఏలూరు జిల్లాలో గ్రామీణ, అర్బన్ ప్రాంతాలకు చెందిన 19,627 మందికి వడ్డీ రాయితీ కింద రూ.42.44 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 22,604 మందికి వడ్డీ రాయితీ కింద రూ.50.47 లక్షల లబ్ధి చేకూరనుంది.

కొండంత అండగా..



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చిరువ్యాపారులకు జగనన్న తోడు పథకం కొండంత అండగా నిలుస్తోంది. ఈ పథకంతో రోజువారీ వడ్డీల బాధ తప్పింది. నేరుగా బ్యాంకు నుంచి రూ.10 వేల వడ్డీ లేని రుణం తీసుకుని వ్యాపారంలో పెట్టుబడిని సొంతంగా పెట్టుకోగలుగుతున్నారు. నెలవారీగా వాయిదాలు చెల్లిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే జగనన్న తోడు పథకం వచ్చాక వీధి, రోడ్డుపక్కన, బహిరంగ ప్రదేశాల్లో వ్యాపారాలు నిర్వహించే వారు సంతోషంగా ఉన్నారు. –ఆర్.విజయరాజు, పీడీ, డీఆర్‌డీఏ, ఏలూరు

సంపూర్ణ సహకారం



పట్టణ ప్రాంతాల్లోని ఫుట్‌పాత్, వీధి వ్యాపారాలు, బహిరంగ ప్రదేశాల్లో వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు జగనన్న తోడు అక్కరకు వచ్చింది. డైలీ పెట్టుబడి కోసం ప్రైవేటు అప్పులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పోయింది. వారి సొంత కాళ్లపై వారు నిలబడేందుకు పథకం దోహదపడింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని పట్టణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో సహకారాన్ని అందజేస్తున్నాం.

–బి.ఇమ్మానియేలు, పీడీ, మెప్మా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు

క్లుప్తంగా

టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా చిక్కాల


చిక్కాల దుర్గాప్రసాద్

కొయ్యలగూడెం: రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్ల అసోసియేషన్(పీటీఎల్ఏ) ఉపాధ్యక్షుడిగా తాను ఎంపిక అయినట్లు చిక్కాల దుర్గాప్రసాద్ సోమవారం పేర్కొన్నారు. పీటీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు పానెం జయకిషోర్‌బాబు ఈ మేరకు నియామక పత్రాన్ని అందించారన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో శ్రీ చిట్టూరి సుబ్బారావు–పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ సెలక్షన్స్, చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.వంశీ కృష్ణ తెలిపారు. మహిళా కళాశాలలో నాలుగు రోజులు పాటు నిర్వహించిన ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన అండర్ 11, 13, 15, 17, 19 విభాగాల్లో బాలబాలికలు పాల్గొన్నారు. వెటరన్స్ విభాగంలో కూడా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన సమ్మెట్ల హేమంత్‌శ్రీకి జిల్లా అసోసియేషన్ తరఫున రూ.10 వేలు, కాంస్య పతకాలు సాధించిన విజయ తేజస్వినికి రూ. 5 వేలు నగదు బహుమతులను అందజేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

తణుకు : తణుకు మండలం కొమరవరంలో విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుసుమ వినోద్‌కుమార్‌కు చెందిన ఇంట్లో పెయింటింగ్ పనుల నిమిత్తం ఇటీవల ముగ్గురు వ్యక్తులు వచ్చారు. కర్నూలు జిల్లా కర్నూలు పట్టణానికి చెందిన రెడ్డి నర్సింహారెడ్డి (50), వరంగల్ జిల్లా కామాపూర్ మండల కేంద్రానికి చెందిన చిలకలపల్లి ఏకాంబరం సోమవారం ఇంట్లో పెయింటింగ్ పనులు చేస్తుండగా వీరు ఎక్కిన ఇనుప పరంజాకు విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో నర్సింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా ఏకాంబరం గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్సై కె.గుర్రయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాత పద్ధతిలోనే శ్రీవారి కళాశాలల నిర్వహణ

ద్వారకాతిరుమల: భీమడోలు, కామవరపుకోటలోని శ్రీవారి దేవస్థానం కళాశాలలను ప్రభుత్వానికి అప్పగించాలని గతంలో చేసిన తీర్మానాన్ని ధర్మకర్తల మండలి రద్దు చేసింది. కొండపైన పద్మావతి కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. శ్రీవారి ప్రధాన ఆలయంతో పాటు, ఉప, దత్తత ఆలయాలు, అనుబంధ సంస్థల ఆదాయ, వ్యయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు ఆమోదముద్ర వేశారు. ప్రధానంగా శ్రీవారి దేవస్థానానికి చెందిన భీమడోలులోని శ్రీ వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల, కామవరపుకోటలోని జూనియర్ కళాశాలకు సంబంధించిన చర, స్థిర ఆస్తులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వ నిర్వహణకు అప్పగించేందుకు 2022 సెప్టెంబర్ 15న తీర్మానించారు. అయితే ఆ తీర్మానాన్ని రద్దు చేయడంతో పాటు, ఆ కళాశాలలను పూర్వ పద్ధతిలోనే దేవస్థానం నిర్వహించాలని తాజాగా తీర్మానించారు. కొండపైన శ్రీ ధర్మ అప్పారాయ నిలయం(120 గదుల సత్రం)పై రెండవ అంతస్తును నిర్మించేందుకు రూ. 9.50 కోట్లతో రూపొందించిన అంచనాలను, అదేవిధంగా ఆలయ ఈశాన్య భాగం నుంచి జంట గోపురాల వరకు రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు రూ. 6.30 కోట్లతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. దేవస్థానానికి సెక్యూరిటీ సిబ్బందిని సప్లై చేసేందుకు వచ్చిన టెండర్లలో విజయవాడకు చెందిన అగిల్ సంస్థ టెండర్‌ను ఆమోదించారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన మైలవరంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి చెందిన విజయవాడ రోడ్డులోని ఖాళీ స్థలంలో వివాహాలు జరుపుకునేందుకు కల్యాణ మండపాన్ని, 8 సూట్ రూమ్‌లు, డైనింగ్ హాలు జీ ప్లస్ వన్ నిర్మాణానికి రూ. 5.10 కోట్లతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. సమావేశంలో ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.


ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు

పంచారామక్షేత్రంలో శాకంబరి అలంకరణ


భీమవరం గునుపూడి పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో సోమవారం శాకంబరి అలంకరణ చేశారు. స్వామి అమ్మవార్లను కూరగాయలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు -భీమవరం(ప్రకాశం చౌక్)

కాలువలోకి దూసుకెళ్లిన కారు

వ్యక్తి గల్లంతుతో ఆందోళన


రత్నభాస్కర్(ఫైల్)


కాలువలో పడిన కారును బయటకు తీస్తున్న పోలీసులు

పెనమలూరు: విజయవాడ–అవనిగడ్డ కరకట్టపై వెళ్తున్న కారు కేఈబీ కెనాల్‌లోకి సోమవారం వేకువజామున దూసుకెళ్లింది. కాలువలో నాలుగడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో కారు సగ భాగం నీటిలో మునిగింది. కారులో ముందు డోర్ తెరిచి ఉండటంతో కారులోని వ్యక్తి సురక్షితంగా బయట పడ్డాడా? లేక కాలువలో గల్లంతయ్యాడా? అనే విషయంలో స్పష్టత లేదు. ముదినేపల్లికి చెందిన గాజుల రత్నభాస్కర్ (47) ఆదివారం రాత్రి మచిలీపట్నం నుంచి ముదినేపల్లి బయల్దేరాడు. అవనిగడ్డ వైపు నుంచి విజయవాడ వైపునకు వస్తుండగా చోడవరం వద్ద సోమవారం వేకువజామున 3.30 గంటలకు కాలువలోకి కారు దూసుకెళ్లింది. కాలువలో కారు పడిందన్న సమాచారంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు వెళ్లారు. కారు ముందు డోర్ తెరుచుకొని ఉంది. పోలీసులు కారులో వెతకగా ఆధార్‌కార్డు దొరకటంతో రత్నభాస్కర్ అని గుర్తించారు. డీఎస్పీ జయసూర్య ఘటనా స్థలం వద్దకు వచ్చి క్రేన్ సాయంతో కాలువలో ఉన్న కారును బయటకు తీయించారు. కారులో దుస్తులు, సెల్‌ఫోన్, కాగితాలు తప్ప ఏమి దొరకలేదు. కనిపించకుండా పోయిన రత్నభాస్కర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.

ముదినేపల్లికి వెళ్లాల్సిన భాస్కర్ విజయవాడ వైపునకు ఎందుకు వచ్చాడనేది పెద్ద ప్రశ్నగా ఉంది. ప్రమాదం జరిగే ముందు తన ఫోన్‌తో కుమార్తెకు లోకేషన్ షేర్ చేశాడు. కాలువలో పడిన కారును పోలీసులు తనిఖీ చేయగా సెల్‌ఫోన్ కారులోనే ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేఈబీ కెనాల్‌లో గాలింపు చేపట్టారు. కరకట్టపై ఉన్న సీసీ కెమెరాలను కూడా పరిశీలిస్తున్నారు. రత్నభాస్కర్‌కు కొందరు సొమ్ము బాకీ పడటంతో ఆర్థిక గొడవలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. రుణం తీసుకుని ఐస్‌ఫ్యాక్టరీ పెట్టడంతో ఆర్థిక పరిస్థితి ఎలా ఉందనే విషయమై పోలీసులు బ్యాంక్ స్టేట్‌మెంట్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి క్రైస్తవుల సమస్యలు

సాక్షి, భీమవరం: వెస్ట్ గోదావరి పాస్టర్స్ ఫెలోషిప్ భీమవరం జోనల్ సమావేశం సోమవారం రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ ఆధ్వర్యంలో భీమవరంలో జరిగింది. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పాస్టర్లకు గౌరవ వేతనాల పెంపుతోపాటు లబ్ధిదారుల జాబితాను పెంచేందుకు కృషిచేస్తామన్నారు.

అండర్–14 బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక


అండర్–14 బాస్కెట్ బాల్ క్రీడాకారులు

పెనుమంట్ర: రాష్ట్ర స్థాయిలో ఈ నెల 21 నుంచి 23 వరకూ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగే బాస్కెట్ బాల్ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా అండర్–14 బాస్కెట్ బాల్ బాలుర జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. మార్టేరు శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపికలు జరిగాయని.. పి.సాయి సత్య వంశీ, ఇ.చార్లెస్ వెస్లీ, ఎ.వినోష్ (కొవ్వలి), ఎస్ఎస్‌సీ సాయి మణికంఠ, జి.వేదాంత్ (తాడేపల్లిగూడెం), బి.అఖిల్, కె.సందీప్ (ఏలూరు), బి.సాయి మణికంఠ (దేవరపల్లి), పి.రాఘవేంద్రరెడ్డి, ఎం.రామతేజ, కె.ఓం శంకర్ రెడ్డి, పి.కిరణ్‌కుమార్ (మార్టేరు) ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సీఎస్ రెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు సత్తి సుబ్బన్నరెడ్డి, జిల్లా కార్యదర్శి మహ్మద్ ఖుర్షీద్, ఎంపిక కమిటీ సభ్యులు చింతకాయల సత్యనారాయణ (తాడేపల్లిగూడెం), గవ్వా శ్రీనివాస్ (ఏలూరు), కర్రి వినాయక్‌రెడ్డి (మార్టేరు) పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పారదర్శక పాలన కోసమే వలంటీర్ల వ్యవస్థ


భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో జన్మభూమి కమిటీల అరాచకం, దోపిడి నుంచి ప్రజలకు విముక్తి కలిగించి పేదలకు పారదర్శక పాలన అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు రూపకల్పన చేశారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. సోమవారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పవన్ రోజుకో విధంగా మాట్లాడడం చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితి బాగా లేనట్లు స్పష్టమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీలో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


వీరంపాలెంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, చంద్రబాబు గజదొంగ లాంటి వాడని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. సోమవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భూత, వర్తమాన కాలాలు అయిపోయాయని, భవిష్యత్ గ్యారంటీ అంటూ ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు వస్తున్నాడని విమర్శించారు. దీనికి తోడు ఆ పార్టీ నాయకులు బస్సుల్లో వస్తున్నారని, దానిలో వచ్చే ఒక్కొక్కడికి ఒక్కో చరిత్ర ఉందని దుయ్యబట్టారు. వీరంతా ప్రజల భవిష్యత్ గ్యారంటీ ఇస్తారంట? అంటూ ఎద్దేవా చేశారు. 28 కేసుల్లో చంద్రబాబు స్టేలతో కాలం వెళ్ళదీస్తున్నాడన్నారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌కు పట్టిన గతే చంద్రబాబుకు పడుతుందని, జైలుకు వెళ్ళడం ఖాయమన్నారు. 2024లోనే ఎన్నికలు జరుగుతాయని, అప్పటి వరకు ప్రజలు సంతోషంగానే ఉంటారన్నారు. తిరిగి జగన్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

గుమ్మలూరులో 12 కాసుల బంగారం చోరీ


గుమ్మలూరులో చోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మనోహరాచారి, సిబ్బంది

పోడూరు: గుమ్మలూరులో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పీఎంపీ వైద్యుడు ఇలపకుర్తి సూరిబాబు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి శనివారం అత్తిలిలోని తన అత్తవారింటికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు ఇంటి ప్రధానద్వారానికి వేసిన తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో బీరువాతాళాలు పగులగొట్టి దాదాపు 12 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు నగదు, కేజీన్నర వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. సూరిబాబు కుటుంబంతో కలిసి సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి చోరీ జరిగిన విషయం గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్ఐ డి.రామ్‌కుమార్, సిబ్బందితో వెళ్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్పీ యు.రవిప్రకాష్, నరసాపురం డీఎస్పీ మనోహరాచారి, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. చోరీ ఘటనపై పాలకొల్లు టౌన్ సీఐ సి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం


కేవీకేలో మాట్లాడుతున్న గోదావరి మండలి సహాయ పరిశోధన సంచాలకురాలు భరత్‌లక్ష్మీ

ఉండి: సామాన్య రైతులు, నిరుద్యోగులను వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు శాస్త్రవేత్తలు మరింత కృషి చేయాలని గోదావరి మండలి సహాయ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ భరత్‌లక్ష్మీ అన్నారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞానకేంద్రంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన పుట్టగొడుగుల పెంపకం కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం చాలా లాభదాయకమన్నారు. పుట్టగొడుగుల పెంపకం, వాటి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. ఇలాంటి వృత్తి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి శిక్షణ పొందే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులు తయారు చేసేవారందరినీ సమకూర్చి వారిని ఒక యూనియన్‌గా ఏర్పాటు చేయాలన్నారు. కేవీకే ద్వారా మరిన్ని శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఔత్సాహిక రైతులను, నిరుద్యోగ యువత, మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు, శాస్త్రవేత్తలు దెబోరా, ఎ.శ్రీనివాస్, ఎ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో అనుమానితుడి మృతి

వీరవాసరం: ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసుల్లో అనుమానితుడిగా ఉన్న కుక్కల శ్రీను సోమవారం ఉదయం మృతి చెందాడు. మండలంలోని రాయకుదురు శివారు జగన్నాథరావు పేటకు చెందిన కుక్కల శ్రీను మృతి వార్త గ్రామంలో కలకలం రేపింది. ఉంగుటూరు మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో కుక్కల శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించి అనంతరం ఇంటికి పంపించామని పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన శ్రీను సోమవారం ఉదయం నీరసంగా ఉందని చెప్పడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మరణించాడు. గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు పేర్కొన్నారు.

ఘనంగా సాంకేతిక దినోత్సవం


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ ఉపకులపతి టి.జానకిరామ్

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు, విద్యార్థులు పాల్గొని వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక ప్రదర్శనను తిలకించారు. ముఖ్య అతిథిగా ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ హాజరై మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన మండలి ప్రారంభించి 95 సంవత్సరాలు గడిచిన సందర్భంగా మూడు రోజుల పాటు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ శాస్త్రవేత్తలను, రైతులను, వ్యవసాయ జర్నలిస్టులను గుర్తించి సత్కరిస్తున్నట్లు చెప్పారు. తొలుత జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం కేవీకే వెంకట్రామన్నగూడెం వారిచే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

మానవత ఆర్థిక సాయం



మహిళకు రూ.10 వేల చెక్కును అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్ : వైద్య ఖర్చుల నిమిత్తం ఓ మహిళకు మానవత ఆర్థిక సాయం అందించింది. తణుకు పాతూరులోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో నివశించే ఉండ్రాజవరపు సువర్ణలత ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నుముకకు తీవ్ర గాయమైంది. ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం తణుకు మానవత సంస్థ రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఏ బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో మానవత సభ్యులు అక్కిన కాశీ, ఆలపాటి సుబ్బారావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, పులమాల బ్రహ్మం, బీ రామకాశీ పాల్గొన్నారు.

శాకంబరిగా చింతామణిదేవి



ప్రత్యేకాలంకరణలో చింతామణి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాఢ అమావాస్య పురస్కరించుకుని పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ యోగ ధ్యాన మందిరంలో సోమవారం చింతామణి దేవి అమ్మవారికి ఆకుకూరలతో, కాయగూరలతో శాకంబరిగా విశేషంగా అలంకరించారు. మహిళలతో సామూహిక శ్రీ లలితా సహస్రనామం, మణిదీవ్యప వర్ణన, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామాలు, శ్రీ కృష్ణ అష్టకాలు పారాయణం చేశారు. ఏర్పాట్లను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

కవి ప్రసాద్‌కు ఘన సన్మానం



కవి ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు : సుప్రసిద్ధ సాహితీ పత్రిక సాహితీ కిరణం సౌజన్యంతో హైదరాబాదులోని కొసరాజు ఆర్థి, జాహ్నవి మెమోరియల్ ట్రస్టు భవనంలో సోమవారం నిర్వహించిన జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్ రచించి, వినిపించిన శూన్యం అనే కవితకు ప్రశంసలు లభించాయి. వెంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు, సాహితీవేత్త కొలకలూరి ఇనాక్, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, ట్రస్టు వ్యవస్థాపకులు కొసరాజు సామ్రాజ్యం తదితరులు కవి ప్రసాద్‌ను సత్కరించారు.

బస్సు యాత్రలో అసత్య ప్రచారాలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను టీడీపీ బస్సు యాత్ర బృందం సోమవారం పరిశీలించింది. మెడికల్ కళాశాల ప్రాంతంలో 60 మంది కూలీలు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తదితరుల బృందం కళాశాల ప్రాంతాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ కళాశాల పనులు ప్రారంభించి మూడున్నరేళ్లు అయినా మూడు రూపాయల పనులు కూడా జరగలేదని విమర్శించారు. కళాశాలకు సుమారు 60 ఎకరాలు భూములిచ్చిన 63 రైతులకు భూములు తీసుకున్న ఏడాదిలోనే ప్రభుత్వం సొమ్ములు చెల్లించింది. వీరిలో బ్యాంక్ ఖాతాలు తేడా రావడంతో ఆరుగురు రైతులకు సొమ్ములు వారి ఖాతాల్లో జమ కావడం ఆలస్యమైంది. అయితే రెండేళ్లకు గాని రైతులకు సొమ్ములు చెల్లించలేదని ఎమ్మెల్యే నిమ్మల అసత్య ప్రచారం చేయడంపై స్థానికులు తప్పుబడుతున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: పెన్షనర్లకు పీఆర్సీ, కరువు భత్యం అరియర్స్ వెంటనే చెల్లించాలని జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్ అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ జమ చేయాలని, పే రివిజన్ కరువు భత్యం బకాయిలు ఒకేసారి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, 11వ పీఆర్సీలో కుదించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇంతకుముందు మాదిరిగానే చెల్లించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డుల ద్వారా వైద్యం అందేలా చూడాలన్నారు. సంఘం కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్ నివేదికలు సమర్పించారు.

త్వరలోనే ఇళ్లస్థలాల సమస్య పరిష్కారం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



వీరంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం గ్రామంలో ఇళ్లస్థలాల సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశానని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రజలకు భరోసానిచ్చారు. సోమవారం సాయంత్రం మండలంలోని వీరంపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అర్హత ఆధారంగా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కుల, మత, రాజకీయాలను పక్కన పెట్టి అందరికీ న్యాయం చేస్తున్నామన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో ఆ పార్టీ నాయకులు ఊళ్లకు ఊళ్లు,చెరువులను తవ్వేసి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో తూరల కంపెనీ పెట్టి కోట్లు దోచేశారని విమర్శించారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సెటిల్మెంట్‌లు, అక్రమ కట్టడాలు చేసిన వారికి, బీరు, బిర్యానీ ఇచ్చే వారికి, మాయమాటలు చెప్పే వారికి ఓట్లు పడవన్నారు. కేఎస్ఎన్ అంటే నమ్మకమని, ఆయనకు దగ్గరకు వెళితే సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గొప్ప పాలనకు జగన్ నియోజకవర్గంలో అభివృద్ధికి కేఎస్ఎన్ కేరాఫ్ అడ్రస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కేతిరెడ్డి మాధవి, చింతా వెంకట్రావు, ఎలిపే గాంధీ, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు జంపెల్లి సత్యవతి, మార్లపూడి సుబ్బారావు, ఉప సర్పంచ్‌లు చిట్టూరి కాశీ విశ్వనాథం, మేణ్ణి రామారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, పరిమి తులసీదాస్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ల సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు ముప్పిడి రమేష్‌రెడ్డి, మాకిరెడ్డి గాంధీరెడ్డి, మాకిరెడ్డి అనిల్ రెడ్డి, కేతిరెడ్డి రామచంద్రారెడ్డి, రెడ్డి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

జగన్ వల్లే ఇంటి వద్దే పింఛన్



ఎటూ తిరగలేని పరిస్థితుల్లో ఉన్న మాకు వలంటీర్లు ఇంటి వద్దే పింఛన్ అందిస్తున్నారు. జగన్ బాబు దయ వల్లే అధికారులు చుట్టూ తిరగకుండానే సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. మాజీవితంలో ప్రభుత్వం నుంచి ఇంత సొమ్ము రావడం చూడలేదు. జగన్ చల్లగా ఉండాలి.

– దూలపల్లి వీరరాఘవులు, రామన్నగూడెం

రూ.99,500 లబ్ధి



నాకు అమ్మ ఒడి, రైతు భరోసా పథకాల కింద రూ.99,500లు లబ్ధి చేకూరింది. తమ అర్హతను బట్టి వలంటీర్లే సంక్షేమ పథకాలకు పేర్లు నమోదు చేసుకుంటున్నారు. నిర్ణీత సమయానికి ప్రభుత్వం నుంచి నేరుగా మా బ్యాంకు ఖాతాలకు సొమ్ములను జమ చేశారు. ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వలేదు.

– గెద్దం సుబ్బలక్ష్మి,రామన్నగూడెం

న్యాయవాదుల నిరసన



తణుకులో బార్ అసోసియేషన్ ఎదుట నిరసన చేపట్టిన న్యాయవాదులు

తణుకు : అవనిగడ్డలో న్యాయవాదిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. న్యాయవాదిపై దాడికి నిరసనగా సోమవారం తణుకు బార్ అసోసియేషన్ ఎదుట న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐలూ ఉభయ జిల్లాల కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ గత రెండేళ్లుగా రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టపరంగా న్యాయం కోసం కక్షిదారుల తరపున న్యాయవాదులు కేసులు వాదిస్తుంటే, కక్షలు పెంచుకుని దాడులు చేయడం దారుణమన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం సమగ్రమైన చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు కొరు వెంకటేశ్వర్లు, జి.అంబేద్కర్, న్యాయవాదులు కొండే శ్రీనివాసరావు, ఎస్.సోమేశ్వరరావు, కె.వెంకట్రావు, వి.మురళి, ఎం.కుటుంబరావు, ఎస్.శ్రీరామరెడ్డి, ఇ.మోషి, టి.రాంబాబు, వి.ప్రభుదాస్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు ఆషాఢ సారె సమర్పణ





సారె సమర్పణలో ఆకట్టుకున్న వెండి రథం ఊరేగింపు, ఆషాఢం సారె సమర్పిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఆషాఢ మాసం పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలోని వాసవి మాతకు ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఆషాఢ సారెను అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ యువ నాయకులు కొట్టు విశాల్ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సంఘ గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, అధ్యక్షులు మండవల్లి చెన్నా నాగేంద్రరావు, కార్యదర్శి మండా బ్రహ్మాజీ, కోశాధికారి నున్న సుందరరావు, ఆర్యవైశ్య మహాసభ ఏపీ శాఖ యువజన గౌరవాధ్యక్షులు కోనా హనుమాన్, పేరూరి కాశయ్య తదితరులు పర్యవేక్షించారు. గొల్లగూడెం సెంటర్ నుంచి వాసవి మాత ఆలయం వరకు అమ్మవారిని వెండి రథంలో ఊరేగించారు. వందలాది మంది ఆర్యవైశ్య మహిళలు పసుపు, కుంకుమలతో, పండ్లతో, చీర, సారెలు, సన్నాయి వాయిద్యాలతో బాణా సంచా నడుమ ఊరేగింపు ఘనంగా సాగింది. ఆర్యవైశ్య, వాసవి, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ వార్డు మహిళా కమిటీల ఏర్పాటు



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణతో కలిసిన వార్డు మహిళా కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ సీపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పట్టణంలోని వార్డుల వారీగా మహిళా కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా వైఎస్సార్ సీపీ మహిళా కమిటీలో ఎంపికై న మహిళలు సోమవారం మంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. ప్రతీ సంక్షేమ పథకం లబ్ధిని నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లోనే జమ య్యేలా డీబీటీని ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను మహిళలకు వివరించి అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు. త్వరలో పట్టణ మహిళా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి కొట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోశం రామలక్ష్మి, బోణం విజయనిర్మల, పలువురు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణలో ప్రజా భాగస్వామ్యం ముఖ్యం



కొమ్ముగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణలో ప్రజాభాగస్వామ్యం ముఖ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను లార్వా దశలోనే నివారించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కరపత్రాల ద్వారా వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యదర్శి ఎల్.మహేశ్వరి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, పి.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ నౌషద్, ఆశాలు వీరలక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడి బయట స్కూల్ వయస్సు ఉన్న విద్యార్థులను పాఠశాలలో నమోదు చేయిద్దామని పశ్చిమ గోదావరి జిల్లా సమగ్ర శిక్ష విలీన విద్యా సమన్వయ కర్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. దివ్యాంగుల పిల్లల ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం సుబ్బారావుపేట భవిత సెంటర్‌ను జిల్లా సమన్వకర్త సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 వరకు దివ్యాంగుల పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయం సిబ్బంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ప్రత్యేక ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి డ్రైవ్ నిర్వహించి బడి బయట ఉన్న స్కూల్ వయస్సు పిల్లలను చేర్పించాలన్నారు. ఎంఈఓ హనుమ మాట్లాడుతూ సమష్టిగా పాఠశాల వయస్స పిల్లలను స్కూల్‌లో జాయిన్ చేయడం, ప్రభుత్వం అందించే అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక తదితర సంక్షేమాలను వారికి అందించాలన్నారు. విలీన విద్య సహాయ సమన్వయకర్త శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పిల్లలకు ఉచితంగా అందించే బోధన సామాగ్రిపై అవగాహన కల్పించారు. అనంతరం వార్డులో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, బాలీశ్వరయ్య, ఎస్‌కే భావాజీ పాల్గన్నారు.

జగనన్న కాలనీకి అప్రోచ్ రోడ్డు నిర్మాణం



దొంగగూడెంలో జగనన్న కాలనీ ప్రధాన రహదారి నిర్మిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని దొంగగూడెంలో ఉన్న జగనన్న కాలనీ ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక సుమారు 200 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, గృహనిర్మాణానికి రుణం మంజూరు చేశారు. ఇప్పటికే కాలనీలో సగంకు పైగా గృహనిర్మాణాలు తుది దశకు చేరుకొన్నాయి. దీంతో కాలనీలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, తాగునీటి సదుపాయ కల్పన పూర్తి చేశారు. ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడ్డ కాలనీ వాసులకు రహదారి నిర్మాణంతో ఇబ్బందులు తొలగనున్నాయి. ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో కాలనీ వాసులు ప్రధాన రహదారి విషయాన్ని మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు రహదారి నిర్మాణం సత్వరం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు. త్వరలోనే అంతర్గత రహదారుల నిర్మాణం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఇబ్బందులు తొలగించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కుల రాజకీయాలతో లబ్ధి పొందిన పితాని

పితానిపై ఎస్సీ నాయకుల ధ్వజం



ఆచంటలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సీ సంఘాల నాయకులు

పెనుగొండ: కులాలను అడ్డం పెట్టుకుని రాజకీయంగా లబ్ధి పొంది, కులపరంగా వెలివేతలను ప్రోత్సహించిన ఘనత మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు దక్కుతుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ విమర్శించారు. సోమవారం ఆచంట ఏఎంసీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్సీ సంఘాల నాయకులు మాజీ మంత్రి పితాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నడిపూడి శివారు మిద్దేవారి పాలెంలో ఎస్సీ కులానికి చెందిన 12 కుటుంబాలను స్థానిక బీసీ సంఘం వెలివేశారని ఆరోపించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారన్నారు. అయితే, మార్టేరు జరిగిన టీడీపీ సభలో మాజీ మంత్రి పితాని, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీరంగనాథరాజు పాలనలో ఆచంటలో ఎక్కడా కులాల గొడవలే లేవన్నారు. కులాలు, మతాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ఏకైక నేత మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుపై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ పేలితే ఊరుకోమని హెచ్చరించారు. ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య మాట్లాడుతూ వెలికు గురైన కుటుంబాలు ఫిర్యాదు చేయకుండా మగ్గిపోవాలా? పితానిగారూ అంటూ ప్రశ్నించారు. కులాల మధ్య గొడవలు పెట్టి రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. బాధితులను కించపరచడం దారుణమన్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుపై దుష్ప్రచారం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ ఈది అనిత, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరావు, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, ఉల్లం జ్యోతి, తప్పెట్ల వెంకట్రావు, ఏఎంసీ డైరెక్టరు కొండేటి భవానీ ప్రసాద్, రావి నాగరాజు, మానుకొండ సత్యనారాయణ, మండల కన్వీనర్లు పలివెల శ్రీను, బుర్రా రవికుమార్, ఇంజేటి సుగుణ రాజు, నాయకులు గంటి బాబూరావు, ఏనుగుపల్లి వరప్రసాద్, సిర్రా పాపారావు, సిర్రా శ్రీరామ్, జి.బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి దశల వారీ ఆందోళనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లుకు కనీస వేతనం అమలు చేయాలని, హెల్త్ అలవెన్స్ బకాయిలు, ఈఎస్ఐ సదుపాయాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 20 నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలో జయప్రదం చేయాలని సోమవారం ఏపీ మునిసిపల్ కార్మిక జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకట్రావులు పట్టణంలో మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు, 27న మునిసిపల్ కార్యాలయాలు ముట్టడి, ఆగస్టు 7న కలెక్టర్ కార్యాలయం ముట్టడి ఉంటుందని వెల్లడించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆందోళనలను విజయవంతం చేయాలని కోరారు.

'అమాయకులెవ్వరికీ అన్యాయం జరగకూడదు'



కోర్టు ఆవరణలో న్యాయ దేవత విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అమాయకులెవ్వరికీ అన్యాయం జరగకూడదన్న సూత్రం న్యాయవ్యవస్థకు పునాది వంటిదని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, పాకా రమేష్ అన్నారు. సోమవారం స్థానిక కోర్ట్ అవరణలోని న్యాయ దేవత విగ్రహం వద్ద అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని బార్ అసోసియేషన్, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో నిర్వహించారు. అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ఏర్పాటుకు గుర్తింపు చర్యగా ఏటా అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంవీ రమణ, పాకా రమేష్‌లు తెలిపారు. న్యాయాన్ని కాపాడితే. న్యాయమే మనల్ని కాపాడుతుందని చెరుకువాడ రంగసాయి ప్రతిజ్ఞ చేశారు. న్యాయదేవత విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, న్యాయవాదులు అడబాల శ్రీనివాస్, మోకా రాముడు, ఎం కాస్త్రో, వాసు గోపాలరావు, చెల్ల రాము, ఉండపల్లి రమేష్ పాల్గొన్నారు.

పోలీసుల సాయం

పాలకోడేరు: పెనుమంట్ర హెడ్ కానిస్టేబుల్ పాలా వరప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో జిల్లాలోని సహచర సిబ్బంది వరప్రసాద్ కుటుంబానికి రూ.2.16 లక్షలు వసూలు చేసి జిల్లా ఎస్పీకి అందించారు. ఎస్పీ రవిప్రకాష్ సోమవారం వరప్రసాద్ స్వగ్రామమైన వేంద్ర వెళ్లి వరప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చి ఆ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వరప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. రాజుల్లంక అంగన్‌వాడీ కేంద్రంలో ఓపెన్ కేటగిరీ, సరిపల్లి గరువు అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ కేటగిరీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. అర్హులైన అభ్యర్థులు తమ పదో తరగతి మార్కుల జాబితా, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 3 పాస్ పోర్టు సైజు ఫొటోలతో మొగల్తూరు సీడీపీవో ఐసీడీఎస్ ప్రాజెక్టు మొగల్తూరు కార్యాలయానికి ఈ నెల 24 తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్వయంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బైక్ చోరీపై కేసు

సాక్షి, భీమవరం: స్థానిక రెండో పట్టణ పరిధిలోని రాయలానికి చెందిన కె.విజయత్ తేజ్ తన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం రాత్రి తన ఇంటి ముందు నిలుపుదల చేసి సోమవారం ఉదయం చూసే సరికి లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

- వన్‌టౌన్ పరిధిలోని మెంటేవారితోటలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదయ్యాయి.
- టూటౌన్ పరిధిలోని ఒక ఫైనాన్స్ ఆఫీసులో దొంగతనం చేసిన వి.శ్యాం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. విజయనగరం జిల్లా నుంచి ఉపాధి కోసం వచ్చిన అతడు దొంగతానికి పాల్పడినట్లు చెప్పారు. సీఐ బి.కృష్ణకుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.